క్లుప్తంగా

దేవదాయశాఖ ఇన్స్‌పెక్టర్‌గా రవికిరణ్‌రెడ్డి

మదనపల్లె సిటీ : దేవదాయశాఖ డివిజనల్ ఇన్స్‌పెక్టర్‌గా రవికిరణ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు చేట్టారు. ఇక్కడ పని చేస్తున్న శశి కుమార్ కర్నూలు జిల్లా నంద్యాలకు బదిలీ అయ్యారు. అక్కడ పని చేస్తున్న రవికిరణ్‌కు మార్‌రెడ్డి మదనపల్లెకు బదిలీపై వచ్చారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానా

పీలేరు రూరల్ : మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసులో 11 మందికి జరిమానా విధించినట్లు సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి తీర్పు మేరకు జరిమానా విధించినట్లు సీఐ వివరించారు. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళలకు దిశయాప్ వరం

కలకడ : బాలికలు, మహిళలకు ప్రభుత్వం కల్పించిన వరం దిశయాప్ అని ఎస్ఐ సిటిస్వామి తెలిపారు. శుక్రవారం కలకడ ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ మల్లంగ్‌షావల్లీ అధ్యక్షతన విద్యార్థినిలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. ప్రతి మహిళ వారి భద్రత కోసం మొబైల్‌లో దిశ యాప్ డౌన్ లోడ్ చేసుకుంటే రక్షణ కవచం వలె ఉంటుందని తెలిపారు. అత్యవసర సమయంలో టోల్‌ఫ్రీ నం 100కు, ఎస్ఐ నెంబర్ 9440900713 ఎప్పుడైనా ఫిర్యాదు చేయవచ్చాన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ బాలక్రిష్ణ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండి

ములకలచెరువు : దిశ యాప్‌ను ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకొని ఆపద సమయంలో సద్వినియోగం చేసుకోవాలని సీఐ సాదిక్ అలీ అన్నారు. శుక్రవారం స్థానిక మండల కేంద్రంలోని కదిరిరోడ్డులో మహిళలకు దిశ యాప్‌పై అవగాహన కల్పించారు. మహిళల మొబైల్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించారు. కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

కీర్తికి కన్నీటి వీడ్కోలు

బి.కొత్తకోట: ఎలుక మందు ప్రభావంతో కాలేయం దెబ్బతిని మృతి చెందిన సీ.కీర్తి (14)కి స్వగ్రామం బి.కొత్తకోట మండలంలోని బీరంగిలో శుక్రవారం అంత్యక్రియలు జరిగాయి. బెంగళూరులోని ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని బీరంగికి తరలించారు. కుటుంబీకులు, గ్రామస్తుల ఆవేదన నడుమ కీర్తికి కన్నీటి వీడ్కోలు పలికారు.

నేడు చీకటిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం

కలికిరి : మండలంలోని చీకటిపల్లి గ్రామం పరిధిలోని చీకటిపల్లి కస్బా, రంగనాధపురం, వినాయకపురంలో శనివారం ఉదయం పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

లక్ష్యాలను పూర్తి చేయండి

తంబళ్లపల్లె : ప్రభుత్వం అమలు చేస్తున్న వాటర్‌షెడ్ పథకంలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు కృషి చేయాలని ఏపీడీ లక్ష్మీనరసయ్య ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో వాటర్‌షెడ్ పథకంపై సమీక్ష నిర్వహించారు. మండలంలో వాటర్‌షెడ్ పథకం ద్వారా చేపట్టిన పనులు గురించి ఆరా తీశారు. పనుల్లో ఏమాత్రం నాణ్యతా లోపం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని టీఏ ఖాజామహ్మద్దీన్‌కు సూచించారు. ప్రతి పాజెక్టులో రూ.30 లక్షల నిధులతో పనులు పూర్తి చేయాలన్నారు. సమీక్షలో ఏఈ యం.సురేష్, డీవోలు హిమబిందు, వెంకటరమణ పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ పక్కా ఇళ్లు

కేవీపల్లె : నవరత్నాలు పథకాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో అర్హతగల ప్రతి ఒక్కరికీ పక్కా ఇళ్లు మంజూరవుతుందని జెడ్పీటీసీ గజ్జెల శృతి అన్నారు. శుక్రవారం మండలంలోని మల్లారపువాండ్లపల్లె రోడ్డు వద్ద జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో మండలంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

గుర్రంకొండ: విద్యార్థులు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత చదవులు అభ్యసించాలని జెడ్పీటీసీ సమ్రీన్‌ముక్తియార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఏపీ గురుకుల పాఠశాలలో పదవతరగతి పరీక్ష ఫలితాల్లో మొదటి, రెండవ, మూడవ స్థానాలు సాధించిన విద్యార్థినులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముగ్గురు విద్యార్థినిలకు ప్రభుత్వం జారీ చేసిన సర్టిఫికెట్లు, పతకాలు, నగదు బహుమతులను జెడ్పీటీసీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రమణమ్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లకు దుస్తుల పంపిణీ

ములకలచెరువు : మండలంలోని పెద్దపాళ్యం పంచాయతీలోని వలంటీర్లకు ఎంపీడీఓ అశ్వనీ, ఎంపీపీ సాయిలీలా శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ వలంటీర్ల ఉత్తమ సేవలను గుర్తించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సొంత నిధులతో దుస్తులను వారికి అందజేసినట్లు చెప్పారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

- కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- నాణ్యమైన విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు
- జగనన్న విద్యాకానుక కిట్లు, జగనన్న ఆణిముత్యాల ప్రోత్సాహక నగదు పంపిణీ
- ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా

మదనపల్లె : పేద విద్యార్థులకు ఎప్పటికి చదువు భారం కాకూడదని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లు, మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీం అస్లాం, మున్సిపల్ చైర్మన్ మనూజరెడ్డి, వైస్‌చైర్మన్లు జింకా వెంకటాచలపతి, నూర్‌అజాం, ఎంపీపీ రెడ్డమ్మ, ఏపీఎంఎస్ఎంఈ డైరెక్టర్ ఆనందపార్థసారధిలతో కలిసి అందజేశారు. ముందుగా ఎన్‌సీసీ కేడేట్లు ఎమ్మెల్యేకి గౌరవవందనం సమర్పించి కార్యక్రమానికి స్వాగతించారు. అనంతరం ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు విద్యాభివృద్ధికి వేలకోట్లు ఖర్చు చేస్తోందన్నారు. అందుకనుగుణంగా విద్యా వ్యవస్థలో సమూలమార్పులు తెచ్చేందుకు నాడు–నేడు, అమ్మ ఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన, జగనన్న గోరుముద్ద తదితర పథకాలను అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిలబెడుతోందన్నారు. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాలతో ప్రభుత్వపాఠశాలలో చేరేందుకు పెద్ద ఎత్తున విద్యార్థులు ముందుకు వస్తున్నారన్నారు. పాఠశాలలు పునః ప్రారంభమైన వెంటనే జగనన్న విద్యాకానుకలో భాగంగా ప్రతి విద్యార్థికి యూనిఫాం, ద్విబాషా టెక్సు పుస్తకాలు, నోటు బుక్కులు, షూ, డిక్షనరీ అందించడం జరుగుతోందన్నారు. డిజిటల్ క్లాసు రూములు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యాబోధన జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మండల పరిధిలో 16,458 జేవీకె కిట్లను విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఏ ప్రభుత్వం మేలు చేస్తోందో గుర్తించాలన్నారు.

ప్రతి విద్యార్థి ఆణిముత్యం కావాలి :

ప్రభుత్వం అందజేస్తున్న సౌకర్యాలను, పథకాలను సద్వినియోగం చేసుకుని ప్రతి విద్యార్థి ఆణిముత్యం కావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. మెరుగైన విద్యతోనే సమాజంలోను, కుటుంబంలోనూ సమూల మార్పులు సాధ్యమవుతాయన్నారు. అనంతరం నియోజకవర్గ స్థాయిలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన వేల్పుల నందిని 586, డి.హిమసాయి 584, ప్రభుత్వ బాలికల రెసిడెన్షియల్ విద్యార్థిని కె.రెడ్డిరాణి 583లకు వరుసగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందజేశారు. అలాగే ఇంటర్మీడియట్ ఫలితాలో ఉత్తమ ఫలితాలు సాధించిన సీ.నవ్యదీపిక బైపిసి, షేక్ రేషమ్‌అఫ్రోజ్ హెచ్ఈసీ, ఎస్.దివాకర్‌రెడ్డి ఎంఈసీ, జి.లలిత ఎంపిసి విద్యార్థులు ఒకొక్కరికి రూ.15వేలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, వెలుగు చంద్ర, వైస్ చైర్మన్ వెంకటరమణ, వైస్ ఎంపీపీలు నందినితాజ్, రమణ, సర్పంచులు మహేష్,ఈశ్వరమ్మ, కరుణాకర్‌రెడ్డి, డివైఈఓ క్రిష్ణప్ప, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి, హెచ్ఎం రుషికేశ, సుబ్బారెడ్డి, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

జగనన్న విద్యాకానుక విద్యార్థులకు వరం

పీలేరు : జగనన్న విద్యాకానుక పేద విద్యార్థులకు వరం లాంటిదని ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కోటపల్లె జెడ్పీ బాలురు, బాలికల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యకు రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని తెలిపారు. జగనన్న విద్యాకానుక కిట్లు సద్వినియోగం చేసుకుని విద్యార్థులు తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా, మాజీ ఎంపీపీ మహితా ఆనంద్, ఎంపీటీసీ నరసింహారెడ్డి, నాయకులు నరేష్‌రామ్‌కుమార్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు మరింత ప్రోత్సాహం

- గత ప్రభుత్వం స్కూళ్లను పట్టించుకోలేదు
- జగన్ వాటి రూపు రేఖలు మార్చేశారు
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

కురబలకోట : విద్యార్థులను చదువుల్లో మరింత ప్రోత్సహించడానికి సీఎం జగన్ జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ప్రారంభించారని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. శుక్రవారం నియోజక వర్గ స్థాయిలో కురబలకోట హైస్కూల్ ఆవరణలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం పండగలా సాగింది. సభలో ఆయన మాట్లాడుతూ విద్య ఒక ఆస్తిలా ఉండాలని, విద్యార్థులకు చక్కని భవిష్యత్తును ఇవ్వాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. 14 ఏళ్లు సీఎంగా ఉండి కూడా చంద్రబాబు ప్రభుత్వ స్కూళ్లకు చేసిందేమీ లేదన్నారు. పైగా కార్పొరేట్ స్కూళ్లకు కొమ్ము కాశారన్నారు. అంతేగాకుండా జగన్ సంకల్పించిన ఇంగ్లీషు మీడియం తదితర విద్యా కార్యక్రమాలను అడ్డుకోడానికి విఫల యత్నం చేశారన్నారు. బాబు పాలన అప్పట్లో రాష్ట్ర ప్రజలకే కాకుండా ప్రభుత్వ బడులకు కూడా శాపంగా మారిందన్నారు. జగన్ సీఎం అయ్యాక రాష్ట్రంలో ఎనలేని మార్పులు వచ్చాయన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ బడులను నాడు నేడు కింద మహర్దశ పట్టించాన్నారు. అమ్మ ఒడి, విద్యా కానుక, గోరు ముద్ద, విద్యా దీవెన తదితర పథకాలు చారిత్రాత్మకంగా నిలిచాయన్నారు. విద్యార్థుల భవితకు పునాదులుగా మారాయన్నారు. ప్రతిభకు పేదరికం అడ్డుకారాదన్న సంకల్పంతో సీఎం జగన్ విద్యార్థులకు ప్రతిదీ ఉచితంగా అందజేశారన్నారు. మరోసారి జగన్‌ను సీఎంగా చేసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పది, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన వారికి నగదు బహుమతితో పాటు మెడళ్లు, సర్టిఫికెట్లు అందజేశారు. పదిలో ముదివేడు మోడల్ స్కూల్ విద్యార్థి ఎ.మల్లికార్జునకు మొదటి స్థానం కింద రూ.15 వేలు, గోల్డ్ మెడల్ అందజేశారు. పీటీఎం జెడ్పీ హైస్కూల్ కె.లలిత్‌కుమార్‌కు ద్వితీయ స్థానం కిందన రూ.10 వేలు, సిల్వర్ మెడల్, సర్టిఫికెట్, బి.కొత్తకోట మండలం గోళ్లపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎం. యశస్వినికి మూడవ స్థానం కింద రూ.5 వేలు నగదు బహుమానం,సిల్వర్ మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. ఇంటర్‌లో పీటీఎం మోడల్ స్కూల్ విద్యార్థి ఎం. హారిక, అదే స్కూల్‌కు చెందిన వి.శిరీషా, ములకలచెరువు జూనియర్ కళాశాల విద్యార్థి కె. పవిత్ర, బి.కొత్తకోట జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్.హసన్‌వల్లికి రూ. 15వేలు చొప్పున నగదు బహుమానం, గోల్డ్‌మెడల్, మెరిట్ సర్టిఫికెట్‌ను అందజేశారు. రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బి.ఈశ్వరయ్య, జడ్పీటీసీ బైసాని జ్యోతి, బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి, ఆరు మండలాల ఎంఈఓలు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


విద్యార్థులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల

పీలేరు : విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 'జగనన్న ఆణిముత్యాలు' చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువులో రాణించిన విద్యార్థుల నగదు ప్రోత్సాహకం ఇవ్వడం ద్వారా వారిలో చదువుపై మరింత ఆసక్తి కల్గుతుందని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ఇంటర్మీడియట్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ఐదుగురికి, రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ. 5 వేలు చొప్పున అందజేశారు. అలాగే పదో తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన ముగ్గురు విద్యార్థులకు రూ. 3 వేలు, రూ. 2 వేలు, రూ. వెయ్యి చొప్పున నగదు ప్రోత్సాహకాలు, మెడల్, ప్రశంసాపత్రం అందజేశారు. చదువులో రాణించిన విద్యార్థుల తల్లిదండ్రులను దుశ్శాలువలతో సత్కరించారు. అనంతరం పీలేరు పట్టణంలో ఆర్‌వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మాణంలో స్థలాలు, ఇళ్లు కోల్పోయిన 120 మంది నిర్వాసితులకు రూ.12.17 కోట్లు చెక్‌లు పంపిణీ చేశారు. అలాగే మండలంలో 1720 ఎకరాల చుక్కభూములకు సంబంధించి 1832 మంది రైతులకు హక్కు పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి, సర్పంచ్ డాక్టర్ హబీబ్ బాషా, పీలేరు, కేవీపల్లె వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు దండు జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, జిల్లా మహిళా అధ్యక్షురాలు మహితా ఆనంద్, ఎంపీపీ ఈశ్వరమ్మ, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, నాయకులు హుమయూన్, చలపతి, నాగరాజమ్మ, మస్తాన్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

కలికిరి : రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని కలికిరి మండలం పారపట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పారపట్ల కురవపల్లి, బాలాజీ కాలని, పారపట్ల కస్బాలో ఎమ్మెల్యే చింతల ఇంటింటికి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి ప్రభుత్వం నుంచి గత నాలుగు సంవత్సరాలలో చేకూరిన లబ్ధి బుక్‌లెట్‌ను అందచేసి, ఇంకా సమస్యలపై ఆరా తీశారు. ఒకొక్క కుటుంబానికి రూ.5 0వేలు నుంచి రూ.5లక్షల వరకు లబ్ధి చేకూరుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నేరుగా, ఎటువంటి దళారీ వ్యవస్థకు తావులేకుండా లబ్ధి చేకూరుతోందన్నారు. వలంటీర్లు, గ్రామ సచివాలయ వ్యవస్థతో కేవలం అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు, మురుగునీటి కాలువలు, తాగునీటి బోరు, వీధి లైట్లు, సిమెంటు రోడ్లు, జళకల బోర్లు, మోటార్లు, విద్యుత్ మీటర్లు, భూ సమస్యలు, సామాజిక ఫించన్లు, రేషన్ కార్డులు తదితర సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలపై సంబంధిత శాఖల అధికారులు త్వరితగతిన పరిష్కార చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో మైనారిటీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, ఎంపీపీ నూర్జహాన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్‌రెడ్డి, శివాజీ, పీలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ యల్లయ్య, మాజీ వైస్ ఎంపీపీ రామచంద్రారెడ్డి, తహసీల్దారు భాగ్యలత, ఎంపీడీఓ గంగయ్య, మండల కో–ఆప్షన్ సభ్యుడు రిజ్వాన్, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, సీకాం సురేంద్రనాధరెడ్డి, గంగయ్య, అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి సీఎం వైఎస్ జగన్

మదనపల్లె : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని ఎమ్మెల్యే ఎం.నవాజ్‌భాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని సీఎల్ఆర్‌సి భవనంలో మదనపల్లె, నిమ్మనపల్లె మండలాల్లోని కొత్తవారిపల్లె, రెడ్డివారిపల్లెకు చెందిన రైతులకు మెగా వాటర్‌షెడ్ పథకంలో మంజూరైన వ్యవసాయ యంత్ర పరికరాలను డ్వామా పీడీ మద్దిలేటితో కలిసి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం రైతుభరోసా, ఆర్‌బీకే కేంద్రాల ఏర్పాటు , పంటల బీమా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వీడీసీ పీఎంకెఎస్‌వై 2.0 (వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ కమిటీ ప్రధాన మంత్రి కృషి సింఛాయి యోజన) పథకంలో భాగంగా వాటర్‌షెడ్ కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని మదనపల్లె మండలం కొత్తవారిపల్లె, నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె ఎంపికై నట్లు తెలిపారు. ఆ గ్రామాల్లోని రైతుల ఉత్పత్తుల పెంపుదల కార్యక్రమంలో భాగంగా వాటర్‌షెడ్ ద్వారా రైతులకు రాయితీపై యంత్ర పరికరాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ,ఎస్టీలకు 90 శాతం, ఇతర వర్గాలను 80 శాతం రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డమ్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ ఆనందపార్థసారధి, సింగిల్ విండో చైర్మన్ రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్‌బీకె చైర్మన్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, నాగరాజ, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు వెంకటరమణ పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్య అత్యంత కీలకం

పీడీ ధనలక్ష్మి


బసినికొండ అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున పీడీ ధనలక్ష్మి

మదనపల్లె : అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు పూర్వ ప్రాథమిక విద్య అత్యంత కీలకమని సమగ్ర శిశు సంక్షేమశాఖ జిల్లా పీడీ ధనలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని బసినికొండ అంగన్‌వాడీ కేంద్రంలోజన్‌భగీదారీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల జీవితంలో మొదటి ఆరు సంవత్సరాలు అత్యంత విలువైనవన్నారు. ఆ దశలో ఆటలు, పాటులు,కథలు ద్వారా పిల్లల మనస్సుకు తాకేలా పూర్వపు ప్రాథమిక విద్యను బోధించాలని సూచించారు. ఈ దశలో నేర్చుకునే సామర్థ్యం పెరిగితే ప్రాథమిక స్థాయిలోనే కాకుండా ఉన్నత స్థాయిలో విద్యను అభ్యసించేందుకు తోడ్పడుతుందన్నారు. బాల్య దశలో వ్యక్తిత్వ వికాసంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. జనబాగిరథి కార్యక్రమం ద్వారా పిల్లల సమగ్రాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు మరింత కృషి చేస్తాయన్నారు. పిల్లల్లో ఎదుగుదలను సమీక్షించడంలో భాగంగా ప్రతి మూడు నెలలకు చైల్డ్ అసెస్‌మెంట్ కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ అందించే ప్రీ స్కూల్ కిట్ ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపడతాయన్నారు.

పారిశుధ్యం పనుల్లో నిర్లక్ష్యం వద్దు

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడంలో నిర్లక్ష్యం చూపవద్దని డీపీఓ ధనలక్ష్మి సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు. శుక్రవారం మండలంలోని వలసపల్లె పంచాయతీ సంపద తయారీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెత్త సేకరణపై సిబ్బందిని ప్రశ్నించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. సేకరించిన వ్యర్థపదార్థాలను సంపద కేంద్రాలను తరలించి ఎరువులు తయారు చేయాలన్నారు. తద్వారా పంచాయతీలకు ఆదాయం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులలో చైతన్యం కోసమే 'జన్‌భగీదారీ'

తంబళ్లపల్లె : ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారుల్లో చైతన్యం కల్పించేందుకే జన్‌భగీదారీ నిర్వహిస్తున్నట్లు సీడీపీవో నాగవేణి తెలిపారు. శుక్రవారం తంబళ్లపల్లె –1 అంగన్‌వాడీ కేంద్రంలో జన్‌భగీదారీ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పిల్లల జీవితంలో మొదటి ఆరేళ్ల వరకు అత్యంత ప్రాధాన్యమైందని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. మొదటి మూడు సంవత్సరాలు తల్లి ఒడికి పరిమితమవుతారన్నారు. అనంతరం బాహ్య ప్రపంచంలో లోక జ్ఞానం కోసం పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ శ్వేత, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమ, కళావతి, సరస్వతి, మహిళా పోలీసులు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు, బూర్లపల్లి ఐసీడీఎస్ సెక్టార్ పరిధుల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సూపర్‌వైజర్లు, జయరాణి, నాగరత్నల ఆధ్వర్యంలో జన్‌భగీదారీ కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్లు మాట్లాడుతూ పిల్లల జీవితాల్లో మొదటి ఆరేళ్లు అత్యంత కీలకమన్నారు. చిన్నారుల శారీరక మానసిక ఎదుగుదలకు ఉపయోగపడేలా ఆట పాటల ద్వారా వారికి విద్య అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న అధ్యాపకులు

వాల్మీకిపురం : ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న ఒప్పంద ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన సందర్భంగా కాంట్రాక్ట్ ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మాట తప్పకుండా తమను రెగ్యులర్ చేయడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నాడు – నేడు కార్యక్రమంతో జూనియర్ కళాశాలలను అభివృద్ధి చేస్తుండడం పేద విద్యార్థుల ఉన్నతిపై ముఖ్యమంత్రికి ఉన్న నిబద్ధతకు అద్దం పడుతోందని తెలిపారు. ఐదేళ్ల సర్వీసు నిబంధనను సడలించి మిగిలిన అధ్యాపకులను కూడా క్రమబద్ధీకరణ చేయాలని కోరారు. కార్యక్రమంలో నరసింహులు, ప్రసాద్, శేఖర్, రమణ, స్వప్న, ప్రేమలత, లక్ష్మిదేవి, రవి, జలాలుద్దీన్, రాజగోపాల్, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యతో పాటు కళా నైపుణ్యం పెంచుకోవాలి

మదనపల్లె సిటీ : విద్యార్థులు విద్యతో పాటు కళా నైపుణ్యాలను పెంచుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణవేణి అన్నారు. శుక్రవారం స్థానిక కాలేజీలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు పెయింటింగ్‌పై వర్కు షాపు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిత్రకళ అనేది అనాధిగా వస్తోందన్నారు. చిత్రలేఖనం నేర్చుకోవడం వల్ల మంచి మేధాశక్తి పెంచుతుందన్నారు. వెయ్యి మాటల కంటే ఒక చిత్రం అన్ని విషయాలు చెబుతాయన్నారు. ఇలాంటి వర్కుషాపులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ప్రముఖ డ్రాయింగ్ మాస్టర్లు సాయిబాబా,ఉషారాణిలు డ్రాయింగ్‌లో మెళుకువలు నేర్పించారు. వర్కుషాపులో విద్యార్థులు పెయింటింగ్‌లు వేశారు.

విద్యావ్యవస్థలో సమూల మార్పులు

కలికిరి : విద్యావ్యవస్థలో సమూల మార్పులు సీఎం జగన్ మోహన్ రెడ్డి చలువేనని మండల ప్రత్యేక ఆహ్వానితులు రత్నశేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మేడికుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి 2022–23 విద్యాసంవత్సరం ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో ఉత్తీర్ణులైన నలుగురు విద్యార్థులకు రూ.12వేలు ప్రోత్సాహక బహుమతిగా నగదు అందజేశారు. అనంతరం ప్రభుత్వం సరఫరా చేసిన జగనన్న విద్యాకానుక కిట్లు విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ప్రభుత్వానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. సర్పంచ్ నాగవేణి, హెచ్ఎం సుబ్రమణ్యం, డాక్టర్ ఏవీ రమణ, మధుసూదన్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, అనీల్ రెడ్డి పాల్గొన్నారు.

పిల్లలను అంగన్‌వాడీలకు పంపాలి

బి.కొత్తకోట : పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపితే ఎన్నో ప్రయోజనాలున్నాయని సీడీపీఓ కే.భాగ్యమ్మ అన్నారు. శుక్రవారం బీసీకాలనీలో అంగన్‌వాడీ కేంద్రం–3 ఆధ్వర్యంలో ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలను ప్రయివేటు కాన్వెంట్లకు పంపకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపితే పౌష్టికాహారం అందించడంతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ హికాద్‌ప్యారీ, కార్యకర్త జి.శ్రీదేవి, మహిళా పోలీసు సల్మా, వైఎస్సార్‌సీపీ నాయకులు ఫయాజ్, సచివాలయ కన్వీనర్ షామిదా, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతికి పెద్దపీట

మదనపల్లె : మైనార్టీల అభ్యున్నతికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎస్.ఎ.కరీముల్లా అన్నారు. శుక్రవారం మండలంలోని తట్టివారిపల్లెలోని మజ్జిద్–ఏ–కదీజతుల్‌కుబ్రా సందర్శించి ప్రత్యేక నమాజులో పాల్గొన్నారు. అనంతరం హార్‌దిల్‌మే వైఎస్సార్ హమ్‌సబ్ జగన్‌కే సాత్ పేరుతో ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. మసీదుల కమిటీ సభ్యులు, పెద్దలతో సమావేశమైన సమస్యలపై చర్చించారు. మైనార్టీల ఆకాంక్షలను అనుగుణంగా మైనార్టీల సబ్ ప్లాన్ తీసుకువచ్చి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధిని నిరూపించుకున్నారన్నారు. కార్యక్రమంలో హాజీ ఇమామ్‌సాహెబ్, మౌజాన్ పీరామ్‌సాహెబ్, రిటైర్డు ఎస్ఐ మున్నా, ముతవల్లి ఖాసిం, అల్తాఫ్, వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

ఈ–నామ్ నమోదుతో రైతులకు మేలు

మదనపల్లె : ఈ–నామ్ వ్యాపారం ద్వారా రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవడం ద్వారా మేలు చేకూరుతుందని వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి అభిలాష్ అన్నారు. శుక్రవారం మార్కెట్‌యార్డులో రైతులు, వ్యాపారులకు ఈనామ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ–నామ్ ద్వారా దేశంలోని అన్ని మార్కెట్‌ల కూరగాయల ధరలు తెలుస్తాయన్నారు. దీంతో వ్యాపారుల మధ్య పోటీ ఏర్పడి రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుందన్నారు. రైతులందరూ తమ పాసుపుస్తకం,ఆధార్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈనామ్‌లో పండించిన పంటల వివరాలను అప్‌లోడ్ చేసే విధానంపై అవగాహన కల్పించారు.

విద్యాభివృద్ధికి రూ. 3లక్షల విరాళం

కురబలకోట : డీసీసీబీ డైరెక్టర్, కురబలకోట సింగిల్ విండో చైర్ పర్సన్ జంగావారిపల్లె జి. అరుణమ్మ పెద్ద మనసు చాటారు. కురబలకోట హైస్కూల్ ఆవరణలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ముఖ్య అతిథిగా శుక్రవారం పండగలా సాగిన జగనన్న ఆణిముత్యాల సభలో ఆమె ఉదారతను చూపారు. నియోజక వర్గంలోని ప్రతి మండలానికి రూ. 50 వేలు చొప్పున విద్యాభివృద్ధి కార్యక్రమాలకు విరాళం అందజేశారు. ఆరు మండలాలకు రూ.3 లక్షల విరాళాన్ని ఆయా మండలాల ఎంఈఓలకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను, ఆమె కుమారుడు గంగసాని ప్రశాంత్ రెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

పీలేరు రూరల్ : స్థానిక చిత్తూరు రోడ్డు మార్గంలోని కౌసర్ మసీదుకు తాగునీటి సౌకర్యం కల్పించడానికి రూ. 5 లక్షలతో పనులు చేపట్టినట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. శుక్రవారం స్థానిక కౌసర్ మసీదు వద్ద పలువురు ముస్లింలు తమ సమస్యలపై సర్పంచ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ స్థానిక వారపు సంత నుంచి ఎస్‌కేడీ నగర్, చిత్తూరు రోడ్డు మీదుగా మసీదు వరకు పైపులైన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మసీదులో అవసరమైన మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

దిశాయాప్‌తో భద్రత, భరోసా

తంబళ్లపల్లె : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దిశాయాప్‌తో మహిళలకు భద్రతతో పాటు భరోసా కలుగుతుందని ఏఎస్ఐ రెడ్డప్పనాయక్ తెలిపారు. శుక్రవారం దిశాయాప్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. మహిళల సెల్‌ఫోన్లలో దిశాయాప్ డౌన్‌లోడ్ చేసి యాప్‌ను వినియోగించే తీరుపై మహిళలకు వివరించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్లు శంకర్, గోపాలక్రిష్ణ, పీసీలు రవి, మణి, రాజేష్, మహిళా పోలీసులు రేవతి,దివ్యలు పాల్గొన్నారు.

అంకాలమ్మ గ్రామోత్సవం

కలికిరి : పట్టణ పరిధిలోని కలకడ రోడ్డులో వెలసిన అంకాళమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ట ఉత్సవలంలో భాగంగా ఆలయ ఆవరణలో హోమాది, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాల గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి క్రాస్ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ వరకు ఊరేగింపు చేశారు. భక్తులు అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక

రామసముద్రం : మండలంలో ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ సభను స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఉపాధిహామీ పీడీ మద్దిలేటి, అసిస్టెంట్ పీడీ మధుబాబు, సహాయ పథక సంచాలకులు మధుబాబు, జిల్లా సహాయ విజిలెన్స్ అధికారి ప్రకాష్, సోషియల్ ఆడిట్‌టీమ్ ఎస్ఆర్‌పి చంద్రమోహన్ హాజరైయ్యారు. 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2023 మార్చి 31 వ తేదీ వరకు జరిగిన పనులపై సభ నిర్వహించారు. 2400 పనులకు గాను రూ. 3.99 కోట్లు ఖర్చుకు సామాజిక తనిఖీ నిర్వహించడం జరిగిందని తెలిపారు. సమావేశంలో పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లపై అభియోగాలు వచ్చాయని తెలిపారు. కురిజల ఫీల్డ్ అసిస్టెంట్ విశ్వనాథ్‌ను విధుల నుంచి తొలగించి మరొకరిని నియమించాలని సూచించారు. రామసముద్రం ఫీల్డ్ అసిస్టెంట్ హేమలత, టీఏలు రూ.1079 రికవరీ, అరికెల వి.చంద్రశేఖర్ రూ.2756 లు, రాగిమాకులపల్లె టెక్నికల్ అసిస్టెంట్ రూ. 1000 జరిమానా , కురిజల ఫీల్డ్ అసిస్టెంట్ నుంచి రూ.2594 రికవరీ చేయాలన్నారు.